నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్ - నిర్మల్

5 | నిజామాబాద్ ఆదివారం 13 ఏప్రిల్ 2025 | ADILABAD NIRMAL


# రైతన్నకు భరోసా ఏదీ?



## సీజన్ ముగిసినా డబ్బులు రాలేదు

### అప్పలకు పెరుగుతున్న వడ్డీలు

### ఇప్పటికైనా డబ్బులు ఇవ్వాలని రైతుల వేడుకోలు

ఆదిలాబాద్, ఏప్రిల్ 12(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం ప్రహసనంగా మారింది. ఎన్నికల వేళ ఎకరాకు రూ.7,500 ఇస్తామని ప్రకటించిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీని నిలబెట్టుకోవడంలో విఫలమైంది. తీరా ఎకరాకు రూ.6 వేలు ఇస్తామని ప్రకటించి పంపిణీ ప్రక్రియను ప్రహసనంగా చేపట్టింది. ఆదిలాబాద్ జిల్లాలో యాసంగి ముగిసినా డబ్బులు జమ కాలేదు. కేవలం నాలుగెకరాలు ఉన్న రైతులకు మాత్రమే ఈ పథకం పైసలు రాగా.. మిగతా వారు తమకు సాయం ఎప్పుడు అందుతుందో అని ఎదురు చూస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రైతుబంధు పథకాన్ని పకడ్బందీగా అమలు చేసింది. రైతులకు సీజన్‌కు ముందుగానే ఎకరాకు రూ.10 వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని అందజేసింది. దీంతో రైతులు రెండు సీజన్‌లలో తమకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి ఇబ్బందులు లేకుండా సాగు చేసి లాభాలు పొందారు.

### సాగుకు అప్పలు

ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 1,63,359 మంది రైతులు ఉన్నారు. యాసంగిలో జొన్న, గోధుమ, వరి, కంది, పల్లి, ఇతర పంటలు సాగు చేస్తారు. సాగులో భాగంగా పెట్టుబడుల కోసం బ్యాంకులు, ప్రైవేటు అప్పులు చేస్తారు. ఈ సీజన్‌లో రైతులు పండించిన పంటలు చేతికి రాగా కొన్ని పంటల అమ్మకాలు పూర్తయ్యాయి. పంటలు విక్రయానికి రాకపోవడంతో మార్కెట్ యార్డుల్లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో శనివారంతో శనగ, కంది కొనుగోళ్లు నిలిపివేశారు. జొన్న పంట తీసిన రైతులు ప్రభుత్వ కొనుగోళ్ల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ పెద్దల ప్రకటనల మేరకు రైతు భరోసా వస్తుందనే నమ్మకంతో అప్పులు తీసుకొచ్చి సాగు చేశామని, సీజన్ ముగియడంతో అప్పులు ఇచ్చిన వారు తమ పైసలు వడ్డీ ఇవ్వాలని అడుగుతున్నారని రైతులు అంటున్నారు. జొన్న కొనుగోళ్లు లేక, రైతు భరోసా రాక అప్పులు ఎలా కట్టాలో తెలియడం లేదంటున్నారు. ప్రభుత్వం రైతు భరోసా పథకం డబ్బులు పంపిణీ చేయాలని కోరుతున్నారు.

### మూడెకరాలు ఉన్న డబ్బులు రాలే..

తలమడుగు, ఏప్రిల్ 12 : నాకు కజ్జర్ల శివారంలో మూడెకరాల భూమి ఉంది. ఈ భూమికి సంబంధించి రైతు భరోసా ఇప్పటివరకు రాలేదు. రైతు భరోసా ఇయ్యక కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసింది. గత కేసీఆర్ ప్రభుత్వం సమయానికి రైతుబంధు ఇచ్చి రైతులను ఆదుకున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు అయినా రైతు భరోసా ఇవ్వడం లేదు. ఇప్పటికైనా రైతు భరోసా రైతుల ఖాతాల్లో జమ చేయాలి. రూ.2 లక్షల రుణమాఫీ చేసి రైతులను ఆదుకోవాలి.

**- చింతరపెల్లి మోహన్ రెడ్డి, కజ్జర్ల, తలమడుగు.**




### రైతుబంధు రాకపాయె..




నాకు గుబిడి శివారులో ఐదెకరాల భూమి ఉన్నది. కాంగ్రెస్ సర్కారు రైతు భరోసా డబ్బులు నాలుగెకరాల వరకు ఇచ్చిందంటే సంబరు పడ్డ. ఐదెకరాలున్న నాకు కూడా వస్తదని అనుకున్న. కానీ.. ఇంతవరకు డబ్బులు రాలేదు. ఇప్పటికే వర్షాలు ఎక్కువై వరదలతో పంటలు నష్టపోయినం. రైతు భరోసా రాక బాధ పెరిగింది. కేసీఆర్ సారు రైతుబంధు అందరికీ ఆలస్యం లేకుంటా చెప్పిన సమయంల ఇస్తుండె. ఇప్పుడీ సర్కారుకు ఏమైందో అర్థం కాకుండా ఉన్నది. ఇప్పటికైనా సర్కారు రైతులను పట్టించుకోవాలా. అందరికీ రైతు భరోసా డబ్బులు ఇవ్వాలే.

**- గడ్డం రవీందర్‌రెడ్డి, రైతు, గుబిడి, భీంపూర్ మండలం**





### రైతులను మోసం చేసిన రేవంత్



తలమడుగు, ఏప్రిల్ 12 : మార్చి 31వ తేదీ వరకు ఐదెకరాల లోపు ఉన్న రైతులకు రైతు భరోసా ఇస్తానని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవలే ప్రకటన చేశారు. మరోసారి రైతులను మోసం చేసింరు. నాకు తలమడుగు శివారులో ఐదెకరాల భూమి ఉంది. నాకు రైతు భరోసా రాలేదు. ఖరీఫ్, రబీ సీజన్‌లకు పెట్టుబడి అందలేదు. రుణమాఫీ చేయక, రైతు భరోసా ఇయ్యక కాంగ్రెస్ రైతులను రోడ్డు మీదికి తీసుకొచ్చింది. అప్పుల బాధతో రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఇలాంటి పాలనను ఎప్పుడు చూడలేదు.

**- బద్దం నవీన్‌రెడ్డి, రైతు, తలమడుగు.**

## కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక

తాంసి, ఏప్రిల్ 12 ః తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలోకి జోరుగా చేరికలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. పాలోడి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి శనివారం జామిడి గ్రామంలో ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదేళ్లలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధిని చూసి చేరుతున్నారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్తారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై 16 నెలల్లోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ వినోద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమణ, మాజీ సర్పంచ్ స్వప్న, మాజీ ఎంపీటీసీలు మహేందర్, మలపతి అశోక్, నాయకులు సైకె అశోక్, రజినీకాంత్‌రెడ్డి, గంద్రత్ అశోక్, సిరి సిరి లక్ష్మిపతి, ఉత్తం, భూమన్న, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## గులాబీ సేన రెడీ



ఆదిలాబాద్‌లో వాల్ రైటింగ్ చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

ఆదిలాబాద్, ఏప్రిల్ 12(నమస్తే తెలంగాణ) : ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఆదిలాబాద్ జిల్లా గులాబీ శ్రేణులు సన్నద్ధమవుతున్నాయి. వరంగల్ సభకు భారీ సంఖ్యలో వెళ్లడానికి నాయకులు, కార్యకర్తలు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే ఆదిలాబాద్, బోథ్ ముఖ్యనాయకులు, కార్యకర్తలు సమావేశాలు నిర్వహించారు. ఆదిలాబాద్ నియోజకవర్గ సమావేశంలో మాజీ మంత్రి జోగు రామన్న, బోథ్ నియోజకవర్గ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వరంగల్ సభను విజయవంతం చేసేలా నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రతి పల్లె నుంచి వెళ్లడానికి నాయకులు గ్రామ స్థాయిలో సమావేశం నిర్వహించి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సభను విజయవంతం చేసేలా వాల్ రైటింగ్స్ ప్రారంభించారు. ఆదిలాబాద్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో వాల్ రైటింగ్స్ రాయించారు.

### కాంగ్రెస్‌పై జనాగ్రహం

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైంది. రుణమాఫీ, రైతు భరోసా, తులం బంగారం ఇతర పథకాల అర్హులైన వారికి అందకపోవడంతో జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ సభకు గ్రామాల నుంచి జనం వెళ్లడానికి ఆసక్తి చూపుతున్నారు. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పటిష్టంగా ఉంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల తర్వాత నాయకులు పార్టీ వెన్నంటే ఉంటూ అధిష్టానం సూచనల మేరకు ప్రభుత్వ వ్యతరేక కార్యక్రమాలు చేపడుతున్నారు.

## నాయకులకు దిశానిర్ధేశం

- రజతోత్సవంపై గులాబీ శ్రేణులకు సూచనలు
- బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్

దస్తురాబాద్, ఏప్రిల్ 12 : బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయంతం చేయాలని ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ అన్నారు. చెన్నూర్ గ్రామంలో శనివారం నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తలు రజతోత్సవానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 27న వరంగల్ నిర్వహించే భారీ బహిరంగ సభకు తరలిరావాలని అన్నారు. గ్రామాల్లో జెండా గద్దెలను తయారు చేయాలని పిలుపునిచ్చారు. అంతకుముందు గ్రామంలోని హనుమాన్ ఆలయ వార్షికోత్సవ, హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట నాయకులు దాసరి సుధాకర్, మాణిక్ రావు, శ్రీనివాస్, కుమార్, రవీందర్, రాజేందర్ ఉన్నారు.



బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్

## కేసీఆర్‌తో మాత్రమే సాధ్యమైంది

### మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, ఏప్రిల్ 12 : తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ నాయకత్వంలో మొట్టమొదటి సారి ఆలయాల నిర్మాణాలను ప్రభుత్వ నిధులతో చేపట్టడం సాధ్యమైదని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శనివారం హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆదిలాబాద్ పట్టణంలోని పలు హనుమాన్ ఆలయాలను సందర్శించారు. ప్రతేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు ఆయనకు సాదరంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఇజ్జగిరి నారాయణ, మెట్టు ప్రహ్లాద్, కొండ గణేశ్, బట్టు సతీశ్, ఉగ్గే విఠల్, అన్నెలా వసంత్, నవతే శ్రీనివాస్, ప్రశాంత్, వినోద్ పాల్గొన్నారు.



పూజ చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

## దొంగల ముఠా అరెస్టు

- ముగ్గురు అరెస్టు.. మరో ముగ్గురు జైలులో.. మరో ముగ్గురు పరారీ
- వివరాలు వెల్లడించిన ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

ఎదులాపురం, ఏప్రిల్ 12 : బ్యాంకుకు కన్నం వేసి దొంగతనానికి యత్నించిన కరడుగట్టిన దొంగల ముఠాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శనివారం పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని రామాయి గ్రామంలో గల తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో దొంగల ముఠా దొంగతనానికి యత్నించి విఫలమైంది. బ్యాంకుకు కన్నం వేసి లోపలికి ప్రవేశించగా బ్యాంకులో అమర్చిన మోషన్ డిటెక్షన్ అలారం సైరన్ మోగడంతో దొంగలు పారిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రామాయి గ్రామంలో సీసీ కెమెరాలు లేకపోవడంతోనే దొంగలను అరెస్టు చేయడంలో ఆలస్యమైంది. సాంకేతిక పరిజ్ఞానంతో నాలుగు నెలల్లో వారిని పట్టుకున్నామన్నారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన చౌహాన్ రవి(ఏ1), సన్నీ అలియాస్ సుక్దేవ్ సన్నీ(ఏ2), పుష్ప అలియాస్ పవన్(పరారీ)(ఏ3), గోవిందుడు కార్తీక్ అలియస్ కార్తీక్(ఏ4), భుక్తాపూర్‌కు చెందిన ధగడ్‌సాయి అలియాస్ సెంబేటి సాయికుమార్ అలియాస్ కుంచాల సాయికుమార్(ఏ5), మణికంఠ(పరారీ)(ఏ6), జాదవ్‌రాజు(పరారీ) (ఏ7), కేఆర్కే కాలనీకి చెందిన అశోక్ ఆశ, (ఏ8), మినుగు రాజేశ్వర్ అలియస్ రాజేశ్(ఏ9)ల పై కేసులు నమోదు చేశారు. వీరు గూగుల్ మ్యాప్ ద్వారా ఆదిలాబాద్ రూరల్ మండలంలోని రమాయిలోని టీజీబీ బ్యాంక్ వివరాలు తెలుసుకున్నారు. వీరందరూ దొంగతనానికి పది రోజుల ముందు హైవేపై గల ఒక దాబాలో చోరీకి ప్లాన్ చేశారు. ఈ కేసులో తొమ్మిది మంది నేరానికి పాల్పడగా, అందులో ముగ్గురు ఏ5 (దగడ్ సాయి), ఏ8(అశోక్), ఏ9(మినుగు రాజేశ్వర్, రాజేశ్)లను శనివారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని కచకంటి గ్రామ శివారులో అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి దొంగతనానికి ఉపయోగించిన గ్యాస్ సిలిండర్, గ్యాస్ కట్టర్, గడ్డపారను స్వాధీనం చేసుకున్నారు. చౌహాన్ రవి, సుక్దేవ్ సన్నీ, కార్తీక్‌లు జైలులో ఉండగా.. పవన్, మణికంఠ, జాదవ్‌రాజులు పరారీలో ఉన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీసీఎస్ సీఐ చంద్రశేఖర్, రూరల్ సీఐ ఫణిదర్, ఎస్సై ముజాహిద్, మావల ఎస్ఐ విష్ణువర్ధన్ పాల్గొన్నారు.




వివరాలను వెల్లడిస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

## గ్యాస్ ధర తగ్గించాలని నిరసన

ఎదులాపురం, ఏప్రిల్ 12 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరను రూ.50 పెంచడాన్ని నిరసిస్తూ శనివారం సీపీఎం ఆధ్వర్యంలో రాణాదివ్యనగర్‌లో గ్యాస్‌బండ, కట్టెల పోయితో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం ఆదిలాబాద్ జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ ఆశన్న మాట్లాడుతూ.. ధరలు పెంచుతూ పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తున్నదని మండి పడ్డారు. గ్యాస్ ధరను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మంజుల, కార్యదర్శి.లంక జమున, జిల్లా నాయకులు ఆశన్న, అరఫా బేగం, నగేశ్, విజయ, రానదివేనగర్ కాలనీవాసులు మాయ, సునీత, సంతోషి, పార్వతి, శాలిక్ రావు, పల్లవి, శోభ, తదితరులు పాల్గొన్నారు.



ఖాళీ సిలిండర్లతో నిరసన తెలుపుతున్న నాయకులు